
సాక్షి
అనంతపురం
శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి.



టమాట కిలో రూ.8

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం రూ.2.50, సరాసరిన రూ.6 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.2°/22.9°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఎంసీఏ, ఎంబీఏ ఫలితాలు విడుదల



జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షల భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో ఆగస్టు, సెప్టెంబర్‌లో నిర్వహించిన ఎంసీఏ నాలుగో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, ఎంసీఏ నాలుగు, ఐదో సెమిస్టర్ (ఆర్–17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ నాలుగో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు.

మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లో ఉద్యోగాలు



అనంతపురం అగ్రికల్చర్: శ్రీసత్యసాయి జిల్లాలో వైఎస్సార్ మొబైల్ అంబులేటరీ క్లినిక్ డాక్టర్, డ్రైవర్ పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని 1962 హెల్ప్‌లైన్ జిల్లా కో ఆర్డినేటర్ రామకృష్ణగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. డాక్టర్ పోస్టుకు బీవీఎస్‌సీ లేదా ఎంవీఎస్‌సీ చేసి ఉండాలని తెలిపారు. నెలకు రూ.40వేల వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. డ్రైవర్ పోస్టులకు పదో తరగతి పాసై ఉండాలని తెలిపారు. హెచ్‌ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ పోనూ నెలకు రూ.10,800 వస్తుందన్నారు. మరిన్ని వివరాలకు 96525 33554, 83740 77951 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

జవాబుపత్రం ఫొటో తీసి కటకటాలపాలు



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని పరీక్షల విభాగంలో మూల్యాంకనం చేయాల్సిన జవాబుపత్రాలను సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి ఒక ఉద్యోగి కటకటాలపాలయ్యారు. పరీక్షల విభాగంలో వీర భద్రయ్య అనే వ్యక్తి డైలీవేజ్ కింద పని చేస్తున్నారు. ఇతను గురువారం జవాబుపత్రాలను తన సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీస్తుండడంతో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరాములునాయక్ గమనించారు. అతడివద్దకెళ్లి సెల్‌ఫోన్ లాక్కున్నారు. అయితే ఆ సమయంలో వీసీ అందుబాటులో లేరు. దీంతో శుక్రవారం ఉదయం అతడిని వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి బంగ్లా వద్దకు తీసుకెళ్లి హాజరుపరిచారు. ఫొటోలు ఎందుకు తీశావని అడిగితే, సరైన సమాధానం ఇవ్వలేదు. ఘటనపై ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరభద్రయ్యను పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

గంగ ఒడికి గౌరీ తనయుడు



అనంతపురం సప్తగిరి సర్కిల్‌లో గణేశుడి శోభాయాత్రకు తరలివచ్చిన భక్తజనం

అనంతపురం కల్చరల్: వినాయక చవితి ఉత్సవాల్లో కీలకఘట్టం నిమజ్జనం. వాడ వాడలా మంటపాల్లో కొలువుదీరిన గణేశుడిని ఐదురోజులపాటు ప్రత్యేక పూజలు, నైవేద్యాల సమర్పణ అనంతరం శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. నగరంతో పాటు జిల్లా అంతటా వినాయక విగ్రహాలను సాయంత్రం నుంచే చెరువులు, కుంటలకు తరలించడం మొదలైంది. ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్లి క్రేన్‌ల సహాయంతో భారీ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేశారు. గణపతి బప్పమోరియ, గణేష్ మహరాజ్‌కీ జై అంటూ భక్తుల జయజయధ్వానాల నడుమ గౌరీ తనయుడు గంగమ్మ ఒడికి చేరాడు. అనంతపురంలో నిర్వహించిన శోభాయాత్రలో కోలాటాల సందడి, పౌరాణిక వేషధారుల ప్రదర్శన, వాయిద్యాల నడుమ భక్తిపారవశ్యంతో నృత్యాలు, ఈలలు, కేకలు మిన్నంటాయి. నిమజ్జనానికి ప్రభంజనంలా తరలివచ్చిన జన సందోహానికి గౌరీ తనయుడు 'మళ్లీ కలుస్తా.. ఈ సంవత్సరానికి ఇక సెలవ్' అంటూ సాగిపోయాడు. అనంతపురం, చుట్టుపక్కల ప్రాంతాల వినాయక విగ్రహాలను కొడిమి, పంపనూరు, రాప్తాడు పండమేరు తదితర నీటి ప్రదేశాల్లో నిమజ్జనం చేశారు.



బైబై.. : నిమజ్జనానికి వెళ్తున్న గణపతి



అనంతపురం సప్తగిరి సర్కిల్‌లో మహిళల కోలాటం



క్లాక్‌టవర్ వద్ద భక్తుల కోలాహలం



నృత్యం చేస్తూ గణేశుడిని సాగనంపుతున్న మహిళలు



నిమజ్జనానికి తరలిన వినాయక విగ్రహాలు





అనంతపురం చెరువులో క్రేన్ సహాయంతో వినాయక విగ్రహాలను జాగ్రత్తగా నిమజ్జనం చేస్తున్న దృశ్యాలు



భక్తా.. ఇక సెలవ్ : వచ్చే ఏడాది తిరిగొస్తా..

'జగనన్న ఆరోగ్య సురక్ష' దూకుడు

- 'అనంత'లో ఇప్పటికే 1.53 లక్షల మందికి వైద్య పరీక్షలు
- శ్రీసత్యసాయి జిల్లాలో 1.18 లక్షల మందికి టెస్టులు
- ఈ నెల 30 నుంచి శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు
- అత్యధికంగా హైపర్ టెన్షన్, మధుమేహ బాధితులకు టెస్టులు
- ఇంటింటా ఆరోగ్య సిబ్బంది సర్వే



బ్రహ్మసముద్రం మండలం మామదూరులో ఇంటి వద్దనే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సచివాలయ ఏఎన్‌ఎం నాగమణి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం స్పీడు పెరిగింది. ఈ నెల 30 నుంచి అన్ని మండల కేంద్రాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్న తరుణంలో రోగులను గుర్తించేందుకు ఆరోగ్య సిబ్బంది జల్లెడ పడుతున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి, వారికి క్రమం తప్పకుండా మందులిస్తారు. రక్తపోటు, మధుమేహం, మూర్ఛ, క్యాన్సర్, గుండె జబ్బులు, నరాల జబ్బులు వంటి వాటిని గుర్తించి రెఫరల్ ఆస్పత్రులకు పంపిస్తారు. దీనికోసం వేలాది మంది సిబ్బంది ప్రతి ఇంటికీ తిరిగి ప్రజల ఆరోగ్య వివరాలు నమోదు చేస్తున్నారు.

భారీగా వైద్య పరీక్షలు

ఉమ్మడి జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా భారీగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈనెల 16వ తేదీనుంచి ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. అనంతపురం జిల్లాలో 1,53,893 మందికి, శ్రీసత్యసాయి జిల్లాలో 1,18,561 మందికి నిర్ధారణ పరీక్షలు చేశారు. బాధితులను ఈ నెల 30 నుంచి నిర్వహించే ఆరోగ్య శిబిరాల్లో డాక్టర్ల వద్దకు తీసుకెళతారు. వ్యాధి తీవ్రతను బట్టి డాక్టర్లు వారికి క్రమం తప్పకుండా మందులు అందేలా చూస్తారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మందులు ఉచితంగా పంపిణీ చేస్తారు. 30న జరిగే వైద్యశిబిరాల కోసం ఈ నెల 25న మాక్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

వైద్య శిబిరాల్లో వీళ్లే ముఖ్యం

- ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉండే ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు.
- ఫ్యామిలీ ఫిజీషియన్ ఉంటారు.

అనంతపురం జిల్లాలో ఆరోగ్య సురక్షలో భాగంగా ఈనెల 20వ తేదీ వరకూ చేసిన టెస్టులు ఇలా

కేటగిరీ	టెస్టుల సంఖ్య
హైపర్ టెన్షన్	50,490
మధుమేహం	38,161
మూత్ర పరీక్షలు	4,336
హిమోగ్లోబిన్	51,409
మలేరియా	2,819
డెంగీ	2,297
కఫం టెస్టులు	2,191
కఫం ఫలితాల సేకరణ	2,190

- వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల స్పెషలిస్టులను డీఎంహెచ్‌ఓ మ్యాపింగ్ చేస్తారు.
- బోధనాస్పత్రికి చెందిన 30 మంది డాక్టర్లు అదనంగా ఉంటారు.
- ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ (ప్రైవేటు) ఆస్పత్రులకు చెందిన స్పెషలిస్టులనూ మ్యాపింగ్ చేస్తారు.
- ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, స్టాఫ్‌నర్సులు శిబిరానికి తగ్గట్లు ఉంటారు.
- వీళ్లు కాకుండా శిబిరాల నిర్వహణలో వివిధ విభాగాల అధికారులు ఉంటారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు ఏర్పాట్లు

'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ నెల 30 నుంచి మండలాల్లో మెగా శిబిరాలు నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించాం. శిబిరాల వారీగా డాక్టర్లను మ్యాపింగ్ చేసి ఆయా శిబిరాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందేలా చేస్తాం.

–గౌతమి, కలెక్టర్

సర్వం సిద్ధం

'ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సర్వం సిద్ధం చేశాం. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎం, తదితర సిబ్బంది ఇంటింటా ఆరోగ్య స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. వివిధ సమస్యలున్న వారిని గుర్తించి ఈ నెల 30 నుంచి నిర్వహించే క్యాంపుల్లో వైద్య చికిత్సందించేలా చర్యలు తీసుకున్నాం. క్యాంపులకు 172 మంది వైద్యులను ఏర్పాటు చేశాం. ముఖ్యంగా ఈ నెల 25న పైలట్ కార్యక్రమంలో భాగంగా అనంతపురం అర్బన్‌లో హమాలీ కాలనీ, రూరల్ మండలంలో ఏ నారాయణపురంలో వైద్య శిబిరం నిర్వహించనున్నాం.

– డాక్టర్ ఈ.భ్రమరాంబ దేవి, డీఎంహెచ్‌ఓ,

నెలాఖరు వరకు ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ



ఉలవలు



జొన్నలు

అనంతపురం అగ్రికల్చర్: ప్రత్యామ్నాయ పంటల విత్తనాల పంపిణీ 80 శాతం రాయితీతో నెలాఖరు వరకు కొనసాగించనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. అక్టోబర్ నుంచి రబీ విత్తన ప్రణాళిక అమలులోకి వస్తుందన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్‌లో ప్రధాన పంటలు సాగు చేయని రైతులు ప్రత్యామ్నాయ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 80 శాతం రాయితీ పోనూ ఉలవలు కిలో రూ.21.60, అలసందలు కిలో రూ.23, పెసలు కిలో రూ.23.50, కొర్రలు కిలో రూ.13.50, అలాగే ఈసారి మేలు రకం జొన్నలు కూడా కిలో రూ.44 ప్రకారం పంపిణీ జరుగుతోందని తెలిపారు. అన్ని రకాల విత్తనాలు 4,835 క్వింటాళ్లు అందుబాటులో పెట్టగా.. అందులో ఇప్పటి వరకు 800 క్వింటాళ్ల పంపిణీ పూర్తయిందన్నారు. కళ్యాణదుర్గం డివిజన్‌లో 1,825 క్వింటాళ్లు, అనంతపురం డివిజన్‌లో 1,198 క్వింటాళ్లు, ఉరవకొండ డివిజన్‌లో 1,128 క్వింటాళ్లు, గుత్తి డివిజన్‌లో 545 క్వింటాళ్లు, రాయదుర్గం డివిజన్‌లో 104 క్వింటాళ్లు, తాడిపత్రి డివిజన్‌లో 35 క్వింటాళ్లు అందుబాటులో పెట్టినట్లు తెలిపారు. ఆర్‌బీకేల్లో సంప్రదించి రిజిస్ట్రేషన్లు, పంపిణీ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పంట వేసిన తర్వాత ఈ–క్రాప్ నమోదు చేయించుకుంటే ప్రయోజనం ఉంటుందన్నారు.

బ్యాంకర్లు లక్ష్యాలు చేరుకోవాలి

- కలెక్టర్ గౌతమి సూచన

అనంతపురం అర్బన్: లక్ష్యాలను త్వరితగతిన చేరుకోవాలని కలెక్టర్ ఎమ్.గౌతమి బ్యాంకర్లకు సూచించారు. బ్యాంకర్లతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం రెవెన్యూ భవన్‌లో ఆర్‌బీఐ ఎల్‌డీఎం అనిల్‌కుమార్, ఎల్‌డీఎం సత్యరాజ్‌తో కలిసి బ్యాంకర్లు, అధికారులతో జిల్లాస్థాయి సమీక్ష కమిటీ (డీఎల్‌ఆర్‌సీ) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కింద కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించడంతో పాటు రుణాలు విరివిగా మంజూరు చేయాలని చెప్పారు. ప్రధానంగా బ్యాంకర్లతో పరిశ్రమలు, వ్యవసాయ, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. స్టాండప్ ఇండియా, జగనన్న బడుగు వికాసం పథకాలకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు మండలాల్లో క్యాంపెయిన్ చేపట్టాలని అధికారులకు సూచించారు. బ్యాంకర్లతో మాట్లాడి అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయించాలని ఆదేశించారు.

రుణాలు మంజూరు చేయాలి

అర్హులకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. ప్రధానమంత్రి ముద్ర యోజన కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ నాటికి 17,821 మంది ఖాతాదారులకు రూ.233.98 కోట్ల రుణాలు మంజూరు చేశారన్నారు. మరింతమంది లబ్ధిదారులకు రుణాలు అందించాలన్నారు. ముద్ర పథకం కింద ఇప్పటి వరకు రుణాలు ఇవ్వని బ్యాంకులు అర్హులైన వారికి మంజూరు చేయాలని ఆదేశించారు. అర్హత కలిగిన వారికి విద్యా రుణాలు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాదారులకు పంట రుణాలు ఇవ్వాలని చెప్పారు. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన కింద కేటాయించిన లక్ష్యాలను చేరుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో పీఎం సురక్ష బీమా యోజన కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు బీమా చేయాలన్నారు. దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. రూ.20 చెల్లించి బీమా పొందడం ద్వారా కలిగే ప్రయోజనాలను మహిళలకు వివరించాలన్నారు.

సీఎస్‌ఆర్ కార్యక్రమాలు చేపట్టండి

బ్యాంకర్లు తమ పరిధిలో సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) కింద కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వాలంటరీ సమీకృత అభివృద్ధి సొసైటీ కింద సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ ప్రాజెక్ట్ కార్యక్రమాలను మరింత పెంచాలని చెప్పారు. జగనన్న తోడు కింద లబ్ధిదారులకు రుణాల మంజూరు, పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని సూచించారు.

ఆర్థిక సహాయం అందించాలి

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్‌ఎం) కింద కేంద్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకం యూనిట్ల స్థాపనకు సబ్సిడీ పథకాన్ని ప్రారంభించిందని కలెక్టర్ తెలిపారు. పశువుల యూనిట్ల స్థాపన విషయంలో అధిక సంఖ్యలో రైతులను ప్రోత్సహించేందుకు బ్యాంకర్లు ఆర్థిక సహాయం చేయాలని చెప్పారు. నేతన్నలకు ముద్ర పథకం కింద బ్యాంకులు 139 దరఖాస్తులకు మాత్రమే అనుమతులు మంజూరు చేశాయని, 674 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అర్హులైన వారికి త్వరగా రుణాలు మంజూరు చేయడంతో పాటు పంపిణీ చేయాలని చెప్పారు. హార్టికల్చర్ పరిధిలో ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ కింద కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా యూనిట్లు మంజూరు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు నరసింహారెడ్డి, విజయలక్ష్మి, పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం, ఉద్యాన శాఖ డీడీ రఘునాథరెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజ్, మత్స్యశాఖ డీడీ శాంతి, బ్యాంకుల ప్రతినిధులు శ్రీకాంత్, లోకేశ్, బాబు నాయక్, అమర్‌నాథ్, తామేష్, సంపత్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, హాజరైన అధికారులు

రేపటి నుంచి పట్టాలపైకి 'వందే భారత్'

- 8.30 గంటల్లోనే కాచిగూడ నుంచి యశ్వంతపూర్ చేరనున్న రైలు
- బుధవారం మినహా వారంలో ఆరు రోజులు నడవనున్న ఎక్స్‌ప్రెస్
- అనంతపురం, ధర్మవరంలో స్టాపింగ్



హిందూపురం అర్బన్ : కాచిగూడ–యశ్వంతపూర్ మధ్య 'వందే భారత్'ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం నుంచి పరుగులు తీయనుంది. దేశవ్యాప్తంగా 9 వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రధాని మోదీ ఈ నెల 24వ తేదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అందులో కాచిగూడ–యశ్వంతపూర్ మధ్య నడిచే 'వందే భారత్'కూడా ఒకటి. వారంలో బుధవారం మినహా మిగిలిన అన్ని రోజులు నడిచే వందేభారత్ రైలు కేవలం 8.30 గంటల్లోనే కాచిగూడ నుంచి యశ్వంతపూర్ చేరేలా రైల్వే అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఉదయం 5.30 గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరే వందేభారత్ (20703) మహబూబ్‌నగర్, కర్నూలు మీదుగా ఉదయం 10.55 గంటలకు అనంతపురానికి, 11.30 గంటలకు ధర్మవరం చేరుకుంటుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు యశ్వంతపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 2.45 గంటలకు బయలుదేరనున్న వందేభారత్ (20704) సాయంత్రం 5.20 గంటలకు ధర్మవరం, 5.41 గంటలకు అనంతపురం, రాత్రి 11.15 గంటలకు తిరిగి కాచిగూడకు చేరుకుంటుంది. కాచిగూడ – యశ్వంతపూర్ మధ్య 609.81 కిలో మీటర్ల దూరం ఉండగా, అందులో సింగిల్ ట్రాక్ 213.31 కి.మీ కాగా, డబుల్ ట్రాక్ 396 .50 కి,మీ ఉంది. వందేభారత్ సగటున 71.74 కి.మీ వేగంతో దూసుకువెళ్లనుంది. భోజన సదుపాయంతో కలిపి ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ టికెట్ ధర రూ. 2,425 కాగా, ఏసీ చైర్ టికెట్ రూ. 1,545గా నిర్ణయించారు.

క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలు అందించండి

- డీసీహెచ్ఎస్ రవికుమార్



మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ రవికుమార్

శింగనమల: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డీసీహెచ్ఎస్ రవికుమార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం శింగనమలలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో వైద్య సేవలు గురించి ఆరా తీశారు. సీహెచ్‌సీలోని ప్రతి గదిని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించి, అక్కడ పని చేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీహెచ్‌సీలో భవనాల సమస్య లేదని, అన్ని వసతులూ ఉన్నాయన్నారు. ప్రసుత్తం కుటుంబ ఆపరేషన్లు జరుగుతున్నాయని, ఇక నుంచి డెలివరీ కేసులను కూడా పెంచాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రమణనాయక్‌కు సూచించారు. సీహెచ్‌సీకి వచ్చే రోగులకు అందుబాటులో ఉండి వైద్యం అందించి ఆస్పత్రికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

సర్వేయర్, ఎలక్ట్రీషియన్ కోర్సులకు ఉచిత శిక్షణ

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని బోరంపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్‌డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్ తెలిపారు. అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్ పూర్తి చేసి 17 నుంచి 45 సంవత్సరాల మధ్య గల వయస్సు కలిగి ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్ నంబర్ 7673902328ను సంప్రదించాలన్నారు.

25లోపు బయోమెట్రిక్ వివరాలు పంపాలి

అనంతపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి అందించే మైనార్టీ ఉపకార వేతనాలు కోసం విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలను ఈ నెల 25లోపు జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపాలని ఉమ్మడి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్‌రఫీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 7,006 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోగా.. వారిలో ఇప్పటివరకు 4,287 మంది వివరాలను మాత్రమే జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపారని పేర్కొన్నారు. మిగిలిన విద్యార్థుల వివరాలను ఈ నెల 25లోగా జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లపై ఉందన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యమొద్దు

- 'జగనన్నకు చెబుదాం'లో జేసీ కేతన్‌గార్గ్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ఆత్మకూరు: వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన అర్జీలకు పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. అర్జీల విషయంలో నిర్లక్ష్యం చూపరాదని స్పష్టం చేశారు. సచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వచ్చిన ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. శుక్రవారం ఆత్మకూరులోని కనకదాస కల్యాణ మండపంలో జాయింట్ కలెక్టర్.. జిల్లా స్థాయి అధికారులతో కలసి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలను జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న, ఎంపీపీ హేమలత, జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డుపల్లి నరసింహారెడ్డి , సర్పంచ్ వరలక్ష్మి తదితరులు వినతిపత్రం అందజేశారు. వర్షాలు లేక పంటలు పూర్తిగా ఎండిపోయాయని పంటలకు ఇన్సూరెన్స్ వర్తింపజేసి రైతులకు ఆదుకోవాలని కోరారు. అలాగే లోఓల్టేజ్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని , విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని కోరారు. మండలంలోని గొరిదిండ్ల వద్ద సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. అలాగే ప్రస్తుతం పక్కా ఇళ్లు కట్టుకోవడానికి చాలా మంది అర్హులు ముందుకు వస్తున్నారని, ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. పేరూరు కాలువకు సంబంధించి జీడిపల్లి నుంచి తీసిన కాలువకు భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ఇంత వరకూ పరిహారం ఇవ్వలేదని, ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా పెంచి ఇవ్వాలని కోరారు. అలాగే పీఏబీఆర్ కాలువకు నీరు ఇచ్చి, వాటి పరిధిలో ఉన్న కుంటలు, చెరువులను నింపాలన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు భూ సమస్యలపై, ఇంటి స్థలాలపై, విద్యుత్ సమస్యలపై అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్, డీఎస్‌డీపీఓ ఓబుళమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్‌ఏఎల్‌సీ వెంకటటేశ్వరరావు , సర్పంచులు ఎర్రిస్వామి, లక్ష్మినారాయణరెడ్డి, రేణుకమ్మ, ఓబులేష్, ఉజ్జినప్ప, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, తహసీల్దార్ షరిమల, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివప్రసాద్, ఏపీడీ రవి, ఏఓ సుచరిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల స్వచ్ఛతే మన లక్ష్యం

గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరం ఆరోగ్యంగా ఉంటామని, గ్రామాల అభివృద్ధికి, స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. శుక్రవారం ఆత్మకూరు మేజర్ పంచాయతీలో మండలంలోని పంచాయతీ కార్మికులతో కలసి కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ కేతన్‌గార్గ్ కార్మికులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా ? జీతాలు అందుతున్నాయా? పని ఎంత సేపు చేస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ప్రతి ఒక్కరు ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం జేసీ వారితో కలసి కాఫీ తాగారు. మండలంలోని పంచాయతీ కార్మికులతో కలసి ఫొటోలు తీయించుకొని , వారిని సన్మానించారు. అనంతరం సచివాలయంలోని ఆధార్ క్యాంపును పరిశీలించారు.

ప్రేమించి పెళ్లాడి .. కులం తక్కువంటున్నారు

- దిశ పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

అనంతపురం క్రైం: 'ప్రేమించి పెళ్లాడిన వాడే కులం తక్కువ దానివని నిందిస్తున్నాడు' అంటూ బాధితురాలు దిశ మహిళా పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదుకు సంబంధించిన వివరాలను దిశ పోలీసుస్టేషన్ సీఐ చిన్నగోవిందు వెల్లడించారు. కళ్యాణదుర్గం మండలానికి చెందిన ఎరుకల చందన, ఎస్‌పీకుంట మండలం పట్టంవారిపల్లికి చెందిన వడ్డే నవీన్ ప్రేమించుకున్నారు. ఇరువురూ పెద్దలను ఎదిరించి ఈ ఏడాది మే 29న కదిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత అనంతపురం నగరంలోని మున్నానగర్‌లో వారు కాపురం పెట్టారు. కొంతకాలం వారి సంసారం సజావుగా సాగింది. అయితే భర్త తరపు వారు వారి సంసారంలో జోక్యం చేసుకోవడంతో చందనకు కష్టాలు మొదలయ్యాయి. వరకట్నం తీసుకురావాలని చందనపై ఒత్తిడి తీసుకువచ్చారు. కులం తక్కువదానివంటూ హేళన చేస్తూ వచ్చారు. రూ.3 లక్షలు తీసుకువస్తే కాపురానికి రావాలని, లేకపోతే ఇంట్లోకి ఉండనివ్వమంటూ దాడి చేశారు. ఈ క్రమంలో పెద్దలు కూడా పంచాయితీలు చేసి ఇరువురికి సర్దిచెప్పారు. అత్తింటికి వెళ్లి డబ్బు తీసుకురావాలని చెప్పడంతో చందన పుట్టింటికి వెళ్లింది. అయితే నవీన్ అక్కడికి వెళ్లి చందన పెళ్లి సమయంలో తీయించుకున్న ఫొటోలను చింపేసి సెల్‌ఫోన్‌ని పగుల గొట్టాడు. నవీన్‌తో పాటు అతని తండ్రి రమణప్ప, బావ నిరంజన్ దాడిలో పాల్గొనడంతో బాధితురాలు కుటుంబ సభ్యులతో కలసి వచ్చి ఎస్సీ, ఎస్టీ, వరకట్నం వేధింపుల కింద ఫిర్యాదు చేసినట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లు మరిన్ని సేవలందించాలి



అవార్డును అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అనంతపురం మెడికల్: 'అనంతపురం వైద్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం గత 15 ఏళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టింది. 2017–18కు గానూ ఉత్తమ ఎన్ఎస్ఎస్ యూనిట్‌గా అనంతపురం వైద్య కళాశాల ఎంపికైంది. ఇందులో భాగంగానే జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. అదే స్ఫూర్తితో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మరిన్ని సేవలందించాలి' అని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ నిహారిక, డాక్టర్ అమృతలక్ష్మి, వలంటీర్లు కేదార్, మహేష్, వరప్రసాద్‌నాయుడు, శిరీష, కృష్ణకాంత్, తరుణ్‌నాయక్, ప్రతిమ యాదవ్‌లకు ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భవిష్యత్తులోనూ సేవాగుణం అలవడుతుందన్నారు. దేశంలోనే ఎస్ఎస్ఎస్ విభాగంలో రాష్ట్రపతి అవార్డు సాధించిన ఏకైక వైద్య కళాశాల అనంతపురం కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కేఎల్ సుబ్రమణ్యం , డిప్యూటీ ఆర్ఎంఓ హేమలత, అనాటమీ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ పునర్జీవన్ కుమార్, డాక్టర్ సహజీర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతో నైపుణ్యాభివృద్ధి

- తిరుపతి రీజియన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ట్రైనింగ్ కె.ఆనందరావు



సదస్సుకు హాజరైన అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు

రాప్తాడురూరల్: పరిశ్రమల ఏర్పాటుతో నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుందని తిరుపతి రీజియన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ట్రైనింగ్ కె.ఆనందరావు పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురంలోని బాలుర ఐటీఐలో 'ఐటీఐ–పరిశ్రమల అనుసంధానం' అనే అంశంపై రాయలసీమస్థాయి సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆనందరావు మాట్లాడుతూ ఐటీఐల్లో నేర్పించే విద్యకు పరిశ్రమల్లో ఓజేటీ శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులు ఎక్కువ నైపుణ్యం పొందుతారన్నారు. తద్వారా మంచి సంస్థల్లో ఉపాధి లభిస్తుందన్నారు. హాజరైన వివిధ పరిశ్రమల ప్రతినిధులు ఒక్కో ట్రేడ్‌ను దత్తత తీసుకుని నైపుణ్యాలు అందించాలని కోరారు. టాటాస్ట్రైవ్ ప్రతినిధి అభిషేక్ మాట్లాడుతూ ప్రస్తుతం 30 ఐటీఐలకు సేవలందిస్తున్నామన్నారు. ఐటీఐల్లో చదువుతున్న విద్యార్థులకు ఓజేటీ, డీఎస్‌టీ పద్ధతుల ద్వారా కంపెనీలతో అనుసంధానం చేస్తామన్నారు. కోర్సు పూర్తయ్యాక విద్యార్థులు ఉద్యోగాలు వెతుక్కునే అవసరం ఉండదన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 56 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి



అశ్విని (ఫైల్)

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మస్తాన్‌పేటలో విషాదం చోటుచేసుకుంది. నీటి సంపులో పడి బి.అశ్విని (3) అనే చిన్నారి శుక్రవారం మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు.. మస్తాన్‌పేటకు చెందిన పెయింటర్ పెద్దయ్య, భారతి దంపతులకు అశ్విని ఒక్కగానొక్క కుమార్తె. మసీదు సమీపంలోని ఓ అద్దె ఇంట్లో వారు నివాసముంటున్నారు. అదే కాలనీలోని గుజిరీ వద్ద పెద్దయ్య ఇటీవల నిర్మించుకున్న తన సొంతింట్లోకి సామాన్లు తరలిస్తున్నారు. ఈ క్రమంలో భారతి తన కూతురు అశ్వినితో అద్దెకున్న ఇంటికి వెళ్లి సామాన్లు సర్దుతోంది. ఆ సమయంలో బయట ఆడుకుంటున్న అశ్విని సంపుపై ఉంచిన అట్టపెట్టెపై కాలుపెట్టి సంపులోకి జారి పడింది. పాప కనిపించకపోయేసరికి చుట్టుపక్కల తల్లిదండ్రులు గాలించారు. చివరకు సంపులో చిన్నారి శవమై తేలింది. అప్పటివరకు తమ కళ్లెదుటే ఆడుకున్న కుమార్తె మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. పెళ్లయినప్పటి నుంచి భారతికి 6 సార్లు గర్భస్రావమైందని, 7వ సారి ఆడ బిడ్డ జన్మించినా చివరకు దేవుడు చిన్నచూపు చూశాడంటూ రోదించిన తీరు స్థానికులను కలచివేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కలెక్టరేట్‌లో విభాగాల విలీనం



అనంతపురం అర్బన్: అనంతపురం నగరంలో ఉన్న కలెక్టరేట్‌లో విభాగాలను విలీనం చేయడంతో పాటు వాటి పేర్లను ప్రభుత్వం మార్పు చేసింది. కలెక్టరేట్‌లో ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్, జీ, హెచ్ విభాగాలు ఉండేవి. ఇందులో ఏ – విభాగం పరిపాలన, బీ– విభాగం అకౌంట్స్, ఆడిట్, సీ – విభాగం న్యాయపరమైన, డీ – విభాగం భూ రెవెన్యూ, రిలీఫ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఈ – విభాగం భూ పరిపాలన, ఎఫ్ – విభాగం ల్యాండ్ రిఫార్మ్స్, జీ – విభాగం భూ సేకరణ, హెచ్ – విభాగం ప్రొటోకాల్, ఎన్నికలు వ్యవహారాలు నిర్వహించేవి. ప్రస్తుతం ఈ విభాగాలను విలీనం చేయడంతో పాటు విభాగాలను పేర్లను మార్పు చేశారు. ఏ, బీ విభాగాలను పరిపాలన విభాగంగా, సీ – విభాగాన్ని మెజిస్టీరియల్ విభాగంగా మార్పు చేశారు. అలాగే డీ ,హెచ్ విభాగాలను కోఆర్డినేషన్ విభాగంగా, ఎఫ్ – విభాగాన్ని ల్యాండ్ రీఫార్మ్స్ విభాగంగా, జీ, ఈ – విభాగాలను ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగంగా మార్పు చేశారు.

'తొండపాడు'ఆలయానికి రూ.11.79 లక్షల ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.11,79,958 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ దేవదాసు తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి ఆధ్వర్యంలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 7 నుంచి శుక్రవారం వరకూ హుండీల్లో భక్తులు వేసిన నగదును లెక్కించారు. వచ్చిన ఆదాయాన్ని గ్రామంలోని దేవాదాయశాఖ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేల్పుల సోమశేఖర్ యాదవ్, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్ పాల్గొన్నారు.

కటకటాల వెనక్కి 'రైలు దొంగ '



పట్టుబడిన దొంగతో జీఆర్పీ అధికారులు

అనంతపురం సిటీ: రైలు ప్రయాణికులే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడే దొంగను అనంతపురం జీఆర్పీ పోలీసులు అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా మాసరకల్ మండలం తెగ్గిహాల్ గ్రామానికి చెందిన రంగయ్య కుమారుడు నాగప్ప (29)ను అరెస్టు చేసి, అతని నుంచి 38 గ్రాముల బంగారు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. బెంగళూరులో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగించే నాగప్ప ఖాళీ సమయాల్లో రైళ్లల్లో వెళ్లే ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని వారి విలువైన వస్తువులు, ఆభరణాలు, నగదును కొట్టేసేవాడన్నారు. ఈ నేపథ్యంలో అతని కోసం వివిధ ప్రాంతాల పోలీసులు గాలిస్తుండగా గుంతకల్లు రైల్వే ఎస్పీ చౌడేశ్వరి, డీఎస్పీ అబ్దుల్ అజీజ్‌కు వచ్చిన పక్కా సమాచారం మేరకు ధర్మవరం సీఐ నాగరాజు, తమ సిబ్బందితో కలసి అనంతపురంలోని ప్లాట్‌ఫాం–4లో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న నాగప్పను వలపన్ని పట్టుకున్నట్లు చెప్పారు. అనంతరం అతన్ని గుంతకల్లు కోర్టుకు తరలించినట్లు వెల్లడించారు.

కన్నింగ్ కౌన్సెలర్‌కు టీడీపీ నేతల అండ

- బాధితుడిని బెదిరించిన వైనం
- కౌన్సెలర్‌ను పోలీసుస్టేషన్‌కు రావొద్దని చెప్పేసిన ఉన్నతాధికారులు

అనంతపురం క్రైం: 'కన్నింగ్ కౌన్సెలర్'కు టీడీపీ నేతలు అండగా నిలిచారు. బాధిత కుటుంబ సభ్యులను బెదిరించారు. రాప్తాడు పరిధిలోని ఓ నాయకుడు బాధితుడికి ఫోన్ చేసి నార్పలకు నన్ను రమ్మంటావా? నువ్వు రాప్తాడుకు వస్తావా? అంటూ గద్దించినట్లు తెలిసింది. నువ్వు చాలా తప్పు చేస్తున్నావు...ఆమెకు ఏ చిన్న హాని జరిగినా నీ కథ చూస్తామంటూ హెచ్చరికలు జారీ చేశాడట. బండికిపోతున్నా .. రేపు వస్తాను అని అతను తప్పించుకున్నట్లు సమాచారం. మరోవైపు కన్నింగ్ కౌన్సెలర్‌ను పోలీసుస్టేషన్‌కు రావొద్దని ఉన్నతాధికారులు తేల్చిచెప్పారు.

కుప్పలు తెప్పలుగా బాగోతాలు

కన్నింగ్ కౌన్సెలర్ బాగోతాల చిట్టా బయటకొచ్చింది. ఓ వ్యక్తి బలాన్ని అడ్డుపెట్టుకుని దిశ మహిళా పోలీసుస్టేషన్‌లో కౌన్సెలర్‌గా నెల రోజుల క్రితం పాగా వేసింది. అక్కడికి కౌన్సెలింగ్‌కు వచ్చే దంపతుల మధ్య చేరి మాయమాటలతో కన్నింగ్ కౌన్సెలర్ తన చేతి వాటాన్ని ప్రదర్శించింది. అయితే చాలా మంది బాధితులు తెరపైకి మాత్రం రాలేదు. తాజాగా మాయలేడి మాటలకు సంబంధించిన ఓ ఆడియో బయటకు రావడంతో దిశ మహిళా పోలీసుస్టేషన్‌లో ఆమె చేసిన అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. రూ.23 లక్షలు పంచాయితీ చేసి రూ.3 లక్షలు కమీషన్ తీసుకుంది. శింగనమల ప్రాంతానికి చెందిన దంపతుల వివాదంలో తలదూర్చి ఓ మైనార్టీ వ్యక్తిని అడ్డుపెట్టుకుని పంచాయితీ చేసింది. ఈ వ్యవహారంలో దంపతులు విడిపోయేందుకు సెటిల్‌మెంట్ చేశారు. తద్వారా బాధిత దంపతుల నుంచి వచ్చిన డబ్బులో రూ.3 లక్షలు పంచుకున్నారు. ఈ క్రమంలో ఇది తప్పని చెప్పిన లేడీ కానిస్టేబుల్‌ని కూడా అప్పట్లో మాయలేడి మందలించినట్లు సమాచారం. కాగా తనకు ఉద్యోగం ఇప్పించిన పెద్దమనిషి పేరు చెప్పడంతో లేడీ కానిస్టేబుల్ జంకినట్లు సమాచారం.

కేసులు కట్టకుండా హుకుం

దిశ పోలీసుస్టేషన్‌లో అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. నెల రోజుల వ్యవధిలో పదికి పైగా దంపతుల కేసులను ప్రైవేటుగా లేడీడాన్ పంచాయితీలు చేసి విడదీశారన్న ఆరోపణలున్నాయి. ఇంతా జరుగుతున్నా దిశ పోలీసు అధికారులు కనీసం గుర్తించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆమెను ఎంపిక చేసిన విధానమే అక్రమ మార్గం. దీనికి తోడు స్టేషన్‌లో సిబ్బందిపై పెత్తనం చెలాయించినా ఎవరూ గుర్తించకపోవడంతో స్టేషన్‌లో కార్యకలాపాలు ఏ విధంగా జరుగుతున్నాయన్నది స్పష్టమవుతోంది. ఏకంగా అధికారులతో సంబంధం లేకుండా స్టేషన్‌కు వచ్చిన కేసులను రికార్డులో నమోదు చేయవద్దని చెప్పి ఆమె ఫోన్ చేసి చెప్పేదట.

ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమే

దిశ పోలీసుస్టేషన్‌కు కౌన్సెలర్‌గా వచ్చిన మాట వాస్తవమే. అయితే ఆమెను ఎవరు ఎంపిక చేశారన్న దానిపై స్పష్టత లేదు. ఆమె ట్రాక్ రికార్డు బాగలేదని కొద్ది రోజుల క్రితమే తెలిసింది. ఆమె స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫోన్ నంబర్లను సేకరిస్తోందని తెలుసుకున్నాను. వారితో ప్రైవేటుగా మాట్లాడుతున్నట్లు తెలియడంతో ఆమెను మందలించాం. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఆమెను పోలీసుస్టేషన్‌కు రావద్దని చెప్పి పంపాము.

– చిన్నగోవిందు, సీఐ, దిశ పోలీసుస్టేషన్

టిప్పర్ ఢీకొని వృద్ధుడి మృతి

పెద్దవప్పూరు: యాడికి మండలంలోని రాయలచెరువు నుంచి వేములపాడు గ్రామానికి వెళ్లే జాతీయ రహదారిలో మోడల్ స్కూల్ వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొంది. ఈ సంఘటనలో పక్కీరప్ప (72) మృతి చెందాడు. వివరాలు.. తూట్రాళ్లపల్లి గ్రామానికి చెందిన పక్కీరప్ప కూలిపనికి వెళ్లి తిరిగి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. అయితే వెనుక వైపు నుంచి ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన పక్కీరప్పను స్థానికులు 108 వాహనం ద్వారా తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ పక్కీరప్ప మృతి చెందాడు. మృతుడి భార్య నాగమ్మ కొన్నేళ్ల క్రితమే మృతి చెందగా, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారందరికీ వివాహాలు అయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు యాడికి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు తలలు.. ఎనిమిది కాళ్లు



ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన బయపరెడ్డి అనే రైతుకు సంబంధించిన ఎనుముకు శుక్రవారం రెండు తలలు, ఎనిమిది కాళ్లు ఉన్న దూడ జన్మించింది. రైతు తెలిపిన వివరాల మేరకు... ఎనుము దూడను ప్రసవించేందుకు తీవ్ర ఇబ్బందులు పడింది. దాదాపు నాలుగు గంటల సమయం పట్టింది. 15 మంది కలసి దూడను బలవంతంగా బయటకు తీశారు. కాని అప్పటికే కడుపులోనే దూడ మరణించిందని రైతు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



కారుకు నిప్పు పెట్టిన దృశ్యం



వివరాలు తెలుసుకుంటున్న వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప

- కారుకు నిప్పు పెట్టిన మృతుని బంధువులు

బుక్కరాయసముద్రం: మండలంలోని అనంతపురం మార్కెట్ యార్డు సమీపంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అనంతపురం వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు... బీకేఎస్ మండల కేంద్రంలోని విరూపాక్షేశ్వర కాలనీకి చెందిన బెస్త తిమ్మయ్య కుమారుడు బెస్త భాస్కర్ (40) డ్రైవర్ పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. భాస్కర్ సొంత పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో అనంతపురం నగరంలో నుంచి కేటీఆర్ ఫంక్షన్ హాలు సమీపంలోని బల్లా పెట్రోలు బంక్ వద్ద విరూపాక్షేశ్వరనగర్ కాలనీలోకి యూటర్న్ తీసుకుంటుండగా గుత్తి వైపు నుంచి వేగంగా వస్తున్న కారు భాస్కర్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో భాస్కర్ అక్కకక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుని బంధువులు, కాలనీ వాసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆగ్రహంతో కారుపై పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. అయితే కేసు ఎవరి పరిధిలోకి వస్తుందన్న విషయంపై వన్‌టౌన్, బీకేఎస్ పోలీసులు తర్జన భర్జన పడటం గమనార్హం. వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నంటే అభిమానం

పరిగి: మండలంలోని పైడేటిలో నిర్వహించిన వినాయక నిమజ్జనం సందర్భంగా భార్గవ్ అనే యువకుడు తన వీపుపై సీఎం జగన్ చిత్రాన్ని టాటూగా వేయించుకున్నాడు. జై జగన్ అనే ట్యాగ్‌లైన్ అక్షరాలతో ఆకర్షణీయంగా ఉన్న చిత్రాన్ని స్థానికులు ఆసక్తిగా వీక్షించారు. ఈక్రమంలో భార్గవ్ వీపుపై చిత్రించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రానికి పలువురు యువకులు, స్థానికులు క్షీరాభిషేకం చేశారు. ఇదే వీడియో సోషల్ మీడియాలో కూడా వైరల్ అయింది.



భార్గవ్ వీపుపై టాటూగా వేసుకున్న సీఎం జగన్ చిత్రానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కేసుల్లో పురోగతి సాధించాలి

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు



అనంతపురం మెడికల్: ఆరోగ్య శ్రీ కేసుల్లో పురోగతి సాధించాలని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లోని ఆయన చాంబర్‌లో వివిధ విభాగాల హెచ్‌ఓడీలతో ఆయన సమావేశమయ్యారు. ఆరోగ్య శ్రీ కింద కేసులను పెంచాలని, ప్రతి కేసూ ఆరోగ్యశ్రీ కింద నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆస్పత్రి విధానాన్ని అమలు చేయాలన్నారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, హెచ్ఓడీలు డాక్టర్ భీమసేనాచార్, డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ రామస్వామి, డాక్టర్ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛ లీగ్ 2.0 ర్యాలీ

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 లీగ్ ర్యాలీని శనివారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి అనంతపురం నగరపాలక సంస్థ నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ సాగుతుందని తెలిపారు.

30 లోపు ఈక్రాప్ బుకింగ్ చేసుకోండి



ఆత్మకూరు వద్ద ఈ క్రాప్ బుకింగ్ అనంతరం పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ రవికుమార్

ఆత్మకూరు: ఈ నెల 30లోపు పంటలు ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏడీఏ రవి కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం ఆత్మకూరు వద్ద సాగు చేసిన ఆముదం, కంది పంటలను ఆయన పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి, ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించాలన్నారు. పంటలకు వాడే మందులు, ఎరువులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత, వీఎస్ఏ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి చర్యలు



కమ్యూనిటీ భవనానికి అంచనా వేస్తున్న దృశ్యం

రాప్తాడు: కమ్యూనిటీ భవనాన్ని త్వరలో నిర్మిస్తామని మండల యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. గ్రామంలో కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే.. అంచనా వేయించాలని చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డికి సూచించారు. శుక్రవారం పంచాయతీ రాజ్ మండల ఇంజనీర్ ఓబుల్‌దాస్ ఎస్టిమేషన్ వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఫక్కీరప్ప, సూర్యనారాయణ, మారక సుబ్బారెడ్డి, తిరుపాల్ రెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రాధాష్టమి వేడుకలు

అనంతపురం కల్చరల్: రాధాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇస్కాన్ మందిరంలో శనివారం ఘనంగా వేడుకలు జరుగనున్నాయి. ఈ మేరకు మందిరంలో జరిగిన సమావేశంలో ఇస్కాన్ చైర్మన్ దామోదర గౌరంగదాసు వివరాలు వెల్లడించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పుష్పాలంకార సేవ, వసంత శోభ, సామూహిక కృష్ణ నామసంకీర్తన, ప్రసాద వితరణ జరుగుతాయన్నారు.

ప్రొఫెసర్ జీవీ రమణ సేవలు ప్రశంసనీయం



ప్రొఫెసర్ జీవీ రమణను సత్కరిస్తున్న పరిశోధన విద్యార్థులు

అనంతపురం: ప్రొఫెసర్ జీవీ రమణ సేవలు ప్రశంసనీయమని ఎస్కేయూ పాలకమండలి సభ్యుడు ప్రొఫెసర్ మునినారాయణప్ప పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగం ప్రొఫెసర్ జీవీ రమణ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, తెలంగాణ ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డు స్వీకరించారు. ఈసందర్భంగా సోషియాలజీ విభాగంలో పరిశోధన విద్యార్థులు, విద్యార్థులు, బోధన, బోధనేతర ఉద్యోగులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో సోషియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చాగంటి రామిరెడ్డి, సోషల్ వర్క్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫిరోజ్, డాక్టర్ శ్రీనివాస రెడ్డి, డాక్టర్ నానీల నాగేంద్ర, రాధిక, ఏ నగేష్, యనమల ప్రసాద్, ఉద్దాల రవీంద్ర పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యా..ఇక సెలవ్!



గణనాథుడి నిమజ్జనంలో బాలికల సందడి



శోభాయాత్రను తిలకిస్తున్న మహిళలు



నిమజ్జనానికి తరలివచ్చిన వినాయక విగ్రహాలు



ఆత్మకూరు వద్ద నిమజ్జనం చేస్తున్న దృశ్యం



చెరువుకట్ట వద్ద మహిళల ఆనందోత్సాహం



చిట్టి గణపతిని నిమజ్జనానికి తెచ్చిన ముస్లిం మహిళ



సప్తగిరి సర్కిల్ వినాయకుడిని నిమజ్జనోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు



వినాయకులను చూడటానికి వచ్చిన ప్రజలతో కిటకిటలాడుతున్న సుభాష్‌రోడ్డు

అనంతపురం కల్చరల్: స్థానిక సప్తగిరి సర్కిల్ వినాయక్ చౌక్ వద్ద నుంచి వినాయక నిమజ్జనంలో భాగంగా శోభాయాత్రను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మేయర్ వసీంతో పాటు డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సహకార్యవాహ యుగంధర్, ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పరుచూరి రమేష్ తదితరులు మాట్లాడారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యతగా గుర్తెరగాలని అన్నారు. అంతకుముందు జిల్లా ఎస్పీ అన్బురాజన్ వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి, శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 700కు పైగా విగ్రహాలు నిమజ్జనం అవుతున్నాయన్నారు. 1000 మంది పోలీసులతో ప్రత్యేక భద్రత ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఓం పతాక అవరోహన కార్యక్రమంతో నిత్య పూజలను ముగించారు. శోభాయాత్రను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వినాయకుడికి నివేదించిన లడ్డూ వేలం వేయగా, రామేశ్వరరెడ్డి అనే భక్తుడు రూ.42 వేలకు దక్కించుకున్నాడు.

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లోని వినాయకులు శుక్రవారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. చిన్మయనగర్ విగ్రహాలతో పాటు అనంతపురంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వినాయకులను పండమేరు వంక, పండమేరు వంకపై ఉన్న ఆర్డీటీ చెక్ డ్యాంలో నిమజ్జనం చేశారు. చిన్మయనగర్‌లో ఎలాంటి ఘర్షణలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాప్తాడు ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

వినాయక ..సెలవిక

ఆత్మకూరు: వినాయక చవితి వేడుకలను ఐదురోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో కొలువుదీరిన వినాయక విగ్రహాలను పంపనూరు వద్దనున్న హంద్రీనీవా కాలువ వద్దకు నిమజ్జనానికి తీసుకెళ్లారు. నిమజ్జన కార్యక్రమంలో భాగంగా ఎలాంటి పొరపాట్లు జరగకుండా పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రం నుంచి పెద్ద పెద్ద విగ్రహాలను తీసుకొచ్చి హంద్రీ నీవా కాలువలో నిమజ్జనం చేశారు. నిమజ్జన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పరిశీలించారు.



అనంతపురం చెరువుకట్టపై నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు





రాప్తాడులో వినాయకుడు, స్కూటర్‌పై గణపతి



రాప్తాడు: నృత్యాలు చేస్తున్న గొరవయ్యలు



రాప్తాడు: డ్యాన్సు చేస్తున్న చిన్నారులు



పంపనూరు వద్ద హంద్రీ నీవా కాలువలో వినాయక నిమజ్జనం చేస్తున్న అనంతవాసులు



వినాయకుడికి హారతులు పడుతున్న చిన్నారులు, మహిళలు



సప్తగిరి సర్కిల్ వినాయక చౌక్ వద్ద పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి, కోగటం తదితరులు



నిమజ్జనానికి బయలుదేరిన సప్తగిరిసర్కిల్‌లోని వినాయకుడు



క్రేన్ సాయంతో నిమజ్జనం చేస్తున్న దృశ్యం





ఆటోపై తరలివెళ్తున్న వినాయకుడు, యువకుల కేరింత



నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు



మహిళల కేరింత



నిమజ్జనానికి అనంతపురం చెరువుకట్టపై క్యూ కట్టిన వినాయకులు



పాతూరులో నిమజ్జనానికి బయలుదేరిన భారీ వినాయకుడు

ప్రతి ఫైలూ సూపరింటెండెంట్ ద్వారానే రావాలి

- సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఏపీసీ నాగరాజు సూచన



మాట్లాడుతున్న ఏపీసీ నాగరాజు

రాప్తాడురూరల్: క్లర్కులు ఎవరికి వారు ఫైళ్లు రాసుకుని నేరుగా తనవద్దకు రాకూడదని, ప్రతి ఫైలూ కచ్చితంగా సూపరింటెండెంట్ ద్వారా రావాలని జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష ఏపీసీ వి.నాగరాజు ఆదేశించారు. శుక్రవారం సమగ్రశిక్ష కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీసీ నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఫైలూ భద్రపరచాలన్నారు. సర్వీస్, ఆర్థిక అంశాలకు సంబంధించినఫైళ్లను అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. ఉద్యోగులంతా పనివేళల్లో కచ్చితంగా కార్యాలయంలో ఉండాలని ఆదేశించారు. కార్యాలయంలో ఉద్యోగులందరూ సమన్వయంగా ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో అందరూ కలిసికట్టుగా ఉంటూ పని చేయాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ సునీల్, ఫైనాన్స్ అకౌంట్ ఆఫీసర్ హరిప్రియ, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, జీసీడీఓ మహేశ్వరి, అసిస్టెంట్ అలెస్కో గోవిందరెడ్డి, అసిస్టెంట్ సీఎంఓ గోపాలకృష్ణ, అసిస్టెంట్ ఐఈడీ షమా, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

బాధితుడికి నిత్యావసర సరుకుల అందజేత



బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న తహసీల్దార్ లక్ష్మీనరసింహ

రాప్తాడు: ప్రమాద బాధితుడు రవికుమార్‌కు తహసీల్దార్ లక్ష్మీ నరసింహ 5 నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. రెండు నెలల క్రితం రాప్తాడులో జరిగిన మొహర్రం వేడుకల్లో అదే గ్రామానికి చెందిన ఎర్రిస్వామి అనే యువకుడు హరిజన రవికుమార్‌ను గాయపరిచిన విషయం తెలిసిందే. దీంతో హరిజన రవికుమార్‌కు కుటుంబ సభ్యులు బెంగళూరులో దాదాపుగా నెల రోజుల పాటు చికిత్స అందించారు. వీరి కుటుంబం దినసరి కూలి పనులకు వెళ్తేగాని పూట గడవని పరిస్థితి. స్థానిక వీఆర్వో రామాంజనేయులు ద్వారా సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మీ నరసింహ శుక్రవారం గ్రామానికి వెళ్లి 5 నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆయన కుమారులు హరీష్ కుమార్, భార్గవ్ కుమార్‌కు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు రవి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అధికారులు బాధ్యతల స్వీకరణ

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో ముగ్గురు అధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల పబ్లిక్ హెల్త్ విభాగం నుంచి ఈఈ సూర్యనారాయణ, ధర్మవరం మున్సిపాలిటీ నుంచి ఈఈ సుధారాణి (బదిలీ), కర్నూలు నగరపాలక సంస్థలో ఏఈగా ఉన్న రవీంద్రారెడ్డి(పదోన్నతి)పై నగరపాలక సంస్థకు నియమితులైన విషయం విదితమే. వీరు ముగ్గురు శుక్రవారం నగరపాలక సంస్థలో బాధ్యతలు చేపట్టారు. పులివెందుల మున్సిపాలిటీలో విధులు నిర్వర్తించే సుభాష్‌చంద్రబోస్ బదిలీపై నగరపాలక సంస్థకు రానున్నారు.

30న కలెక్టరేట్ ఎదుట ధర్నా

రాప్తాడురూరల్: విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 30న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు తెలిపారు. శుక్రవారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, ఉపాధ్యక్షులు సతీష్, రాష్ట్ర కౌన్సిలర్లు రమణ, సర్దార్ వలి, జిల్లా నాయకులు వన్నప్ప, మదన్, హనుమంతు, లక్ష్మీనారాయణ, ఎల్లప్ప, శ్రీనివాసులు, ఓబులేసు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏఓ తిరుమలరెడ్డి

అనంతపురం రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అనంతపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయ పరిపాలనాధికారి తిరుమలరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ, గర్భస్థ, పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం కమిటీ ఆధ్వర్యంలో డివిజనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయ ఏఓ తిరుమలరెడ్డి మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టంపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆశా వర్కర్లు, వలీర్లు పుట్టబోవు బిడ్డ ఆడ, మగ ఇద్దరూ సమానమే అనే అంశంతో పాటు లింగ నిర్ధారణ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రేణుక, రవికుమార్, రెడ్స్ సంస్థ సభ్యులు భానూజ, ఆర్డీటీ కోఆర్డినేటర్ నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవే లక్ష్యం



మాట్లాడుతున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ ప్రాంతీయ సహకార్యదర్శి యుగంధర్

అనంతపురం కల్చరల్: దివ్యాంగుల సేవే లక్ష్యంగా సక్షమ్ సంస్థ పని చేస్తుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ ప్రాంతీయ సహ కార్యదర్శి యుగంధర్ అన్నారు. సక్షమ్ ఆధ్వర్యంలో స్థానిక కోవూరునగర్‌లోని విద్యారణ్య పీఠం ప్రాంగణంలో శుక్రవారం దివ్యాంగ సేవా కేంద్రం ప్రారంభమైంది. సక్షమ్ జాతీయ స్థాయిలో దివ్యాంగుల కోసం పనిచేస్తున్న సంస్థ అని ముఖ్యఅతిథిగా విచ్చేసిన యుగంధర్ అన్నారు. దివ్యాంగ సేవా కేంద్ర ప్రారంభోత్సవం సందర్భంగా దివ్యాంగుడైన నీలకంఠారెడ్డికి ప్రత్యేకంగా తయారు చేయించిన మూడు చక్రాల వాహనాన్ని యూఎస్ఏకి చెందిన చల్లా వెంకటరమణ అందించారు. సక్షమ్ జిల్లా అధ్యక్షుడు సుంకు వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సక్షమ్ ప్రాంత సహాయ కార్యదర్శి డాక్టర్ భాను కిరణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ నాయకులు చిరంజీవిరెడ్డి, సక్షమ్ జిల్లా కార్యకారిణి, సక్షమ్ కార్యకర్తలు, అనేకమంది దివ్యాంగులు పాల్గొన్నారు.